

అలంకారప్రాయంగా
కూరగాయల మార్కెట్ - 8లో..

పాఠశాలలు తెరవకముందే
వసతులు కల్పించాలి - 8లో..



ఆహ్లాదం అందేనా?

- నిలిచిన సిరిసిల్ల అర్బన్ పార్కు ప్రారంభోత్సవం
- నాలుగేళ్లుగా నిరీక్షణ
- రూ.3 కోట్లతో 200 ఎకరాల్లో పార్కు అభివృద్ధి పనులు
- రూ.1.40 కోట్లతో ఆక్సిజన్ పార్కు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల అర్బన్ పార్కు అందాలతో ఊరిస్తున్నా ప్రజలకు ఆహ్లాదం అందడం లేదు. శాసనసభ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించడానికి హడావుడి చేశారు. ట్రయల్ రన్ ద్వారా సందర్శకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నా అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం కాస్తా వాయిదా వేశారు. తరువాత ప్రభుత్వమే మారిపోవడంతో ప్రారంభోత్సవం పెండింగ్‌లో పడింది. ఇదే సమయంలో లోక్‌సభ ఎన్నికలు రావడంతో మళ్లీ కోడ్ ముందుకొచ్చింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో సిరిసిల్ల అర్బన్ పార్కు ప్రజలకు అందుబాటులోకి ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు.

ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి పట్టణ ప్రజలు దూర తీరాలకు ప్రయాణం చేస్తుంటారు. గత ప్రభుత్వం నగరవాసులకు ఆహ్లాదాన్ని అందించే దిశగా పార్కుల ఏర్పాటును చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు ప్రతీ గ్రామంలో ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 12 మండలాల్లో 255 గ్రామ పంచాయతీలు 12 హ్యాబిటేషన్‌లలో పల్లె ప్రకృతి వనాల పేరిట విలేజీ పార్కులను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే సిరిసిల్ల మున్సిపల్ నగర వాసులకోసం అర్బన్ పార్కుకు శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోనే సిరిసిల్ల అర్బన్ పార్కు నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. సిరిసిల్ల- కామారెడ్డి ప్రధాన రహదారిలో పోతిరెడ్డిపల్లె అటవీ ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన అర్బన్ పార్కు సిరిసిల్ల వాసులకు అందుబాటులోకి రావడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కంపా నిధులు, హరితహారంలో భాగంగా సిరిసిల్ల ప్రజల కోసం అర్బన్ ఫారెస్ట్ పార్కును అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 26 జూన్2020న అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి అప్పటి మంత్రి కేటీఆర్ పనులను ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే ప్రజలకు పార్కు అందుబాటులోకి వస్తుందని భావించినా దాదాపు నాలుగేళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. సిరిసిల్లకు మున్సిపల్‌కు 10 కిలోమీటర్ల దూరంలో సిరిసిల్ల - కామారెడ్డి రోడ్డులో పోతిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో రూ. 3కోట్ల వ్యయంతో 200 ఎకరాల్లో అర్బన్ పార్కు పనులను చేపట్టారు. దీంతోపాటు రూ.1.40 కోట్లతో అదనంగా ఆక్సిజన్ పార్కు, చిల్డ్రన్ పార్కులు రూపకల్పన చేస్తూ నిధులు మంజూరు చేశారు. అనేక వృక్షాల మధ్య 200 ఎకరాల్లో పికినిక్ స్పాట్‌తోపాటు పెద్ద వనాలు, బటర్‌ఫ్లై పార్కు, ఔషధ మొక్కలు వంటి వాటితో విభిన్నమైన రీతిలో పార్కును రూపొందిస్తున్నారు.







● ఆకట్టుకునే అందాలు

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం మండలంలోని పోతిరెడ్డిపల్లి సమీపంలో 581 హెక్టార్ల విస్తీర్ణంలో అట వీ ప్రాంతం ఉంది. 200 హెక్టార్లలో దట్టమైన చిట్టడవిని పెంచుతూ 10 హెక్టార్లలో ప్రజలకు అవసరమైన వసతులను ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఆడుకోవడంతోపాటు ఆహ్లాదం పొందేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకు న్నారు. ఇందులో భాగంగా చిల్డ్రన్ ప్లే ఏరియా, గజిబో, కార్తీక వనం, పిక్నిక్ స్పా ట్, కల్చరల్ పార్కు, అర్బల్ గార్డెన్, వాచ్ టవర్, ట్రెక్కింగ్ పార్కు, యోగా షెడ్ల నిర్మాణం చేపట్టారు. గజిబో, యోగా కేంద్రం, ఎంట్రెన్స్ ప్లాజా, లోటస్ పాండ్, రక్షణ కంచెలు, చెక్‌డ్యాం పనులు పూర్తయ్యాయి.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, మే 17: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన పద్మనాభస్వామి, రామంచంద్రస్వామిని దర్శిం చుకున్నారు. అనంతరం బాల త్రిపురసుందరిదేవి ఆలయంలో భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

విదేశీ పర్యటనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దుబాయిలో స్వాగతం పలుకుతున్న ఎన్‌ఆర్‌ఐలు

వేములవాడ టౌన్, మే 17 : విదేశీ పర్యటనలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం దుబాయి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత దుబాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కలిసేందుకు వెళ్లినట్లు తెలిపారు. దుబాయిలో ఐదు రోజులపాటు పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుబాయికి చేరుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఎన్‌ఆర్‌ఐలు స్వాగతం పలికారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, మే 17: ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్షం పడుతున్న సమయంలో చెట్ల కిందకు, బయటకు వెళ్లవద్దన్నారు. చెట్ల మీద పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇటీవల అకస్మాత్తుగా పిడుగులు పడడంతో జిల్లాలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి మీదపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు వాగులు, చెరువులు, కుంటలు నిండుకుండలా ఉంటాయని, పిల్లలు, యువత వెళ్లవద్దన్నారు.

దర్గాలో మొక్కుల చెల్లింపు

సిరిసిల్ల రూరల్, మే 17: సిరిసిల్ల జిల్లా టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు శుక్రవారం గొల్లపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి మొక్కులు చెల్లించారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు మ్యాజిక్ ఆటోలతో ర్యాలీ తీసి ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి దర్గాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. టాటా మ్యాజిక్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాథుల వినోద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, మే 17 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు అన్నారు. కోనరావుపేట మండలంలోని సుద్దాల, కొలనూరు, మామిడిపల్లి, నిజామాబాద్, మల్కపేట గ్రామాల్లో డెంటల్, చెవి, ముక్కు, గొంతు సంబంధించిన వ్యాధులపై శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుద్దాల, మామిడిపల్లి వైద్య శిబిరంలో మాట్లాడారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజలను అప్రమత్తం చేసి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. శిబిరంలో మండల వైద్యాధికారి మదన్‌మోహన్, వైద్యులు శ్రీనివాస్, సుష్మ, శివరామకృష్ణ, ప్రీతి, అఖిల్, వెంకటేష్ సిబ్బంది శ్రీదేవి, కవిత, అశోక్, ఆశావర్కర్లు జమున, పద్మ, హేమలత, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిద్దోగం వేడుకలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట, మే17 : గంభీరావుపేటలో నిర్వహించనున్న ఎల్లమ్మ సిద్దోగం వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయంను స్థానిక గౌడ సంఘం నాయకులు ఆహ్వానించారు. స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే రేణుకా ఎల్లమ్మ సిద్దోగం వేడుకలకు రావాల్సిందిగా శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. గౌడ సంఘం నాయకులు చేరాల రాజాగౌడ్, గోపగారి లక్ష్మినారాయణ, పాపగారి శ్రీనివాస్, పాపగారి యాదగిరి, పర్శరాములు, సతీష్, అశువర్ధన్, ప్రశాంత్, పవన్ ఉన్నారు.

పాఠశాలలు ప్రారంభించేలోపు పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఎల్లారెడ్డిపేట, మే 17: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మరమ్మతు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, దుమాల గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి వసతులను క్షేత్ర స్థాయిలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, తాగు నీటి వసతి, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. పనుల వివరాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్‌జయంతి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పనులను చేపడుతున్నామన్నారు. తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేయడంతోపాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగు నీటి వసతి కల్పించనున్నట్లు చెప్పారు. గదుల్లో ఫ్యాన్లు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. నాణ్యతతో కూడిన పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ గీత సింగనాథన్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీఈవో రమేశ్, ఎంపీడీవో సత్తయ్య, ఏఈలు అశోక్‌రావు, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, మహేందర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

వీర్నపల్లి : పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల ప్రాథమిక, గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పనులను అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా తాగునీటి వసతి ఏర్పాటు చేయా లన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యాల పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. టీఎస్ఈ డబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథన్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీఈవో రమేష్ కుమార్, ఎంపీడీవో సత్తయ్య, డీఎల్పీవో నరేష్ కుమార్, ఎంఈవో రఘుపతి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

కేంద్రాల్లోని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

రుద్రంగి, మే 17: కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులకు ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలోని సింగిల్ విండో కొనుగోలు కేంద్రాలను, మానాల, సమీపంలోని తండాల వద్ద ఉన్న కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శుక్రవారం పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని రైస్ మిల్లు, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి రైస్ మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని, ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్లు శ్రీలత, అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. వాహనదారుల చింత



గుంతలమయమైన రోడ్డు

తంగళ్లపల్లి, మే 17: తంగళ్లపల్లి-లక్ష్మీపూర్ రోడ్డుపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి లక్ష్మీపూర్ గ్రామం రెండు కిలోమీటర్ల దూరం ఉంటే గుంతలు మాత్రం యాభైకి పైగా ఉన్నాయి. రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ప్రమదాలు జరగుతున్నాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF SURNAME

★ I, ETTEDE RAVI S/O. LINGAM R/O. H.NO. : 2-69, JAGGASAGAR (V), METPALLY (M), JAGITHYAL (D), NOW I, CHANGED MY SURNAME AS ETTEDI RAVI S/O. LINGAM
AJK-15433

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 8374272245.
AJV_192817

లాస్ట్ ఛాన్స్ అక్టోబర్ పరీక్షల్లో

★ ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ, 100%పాస్ గ్యారంటీతో పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి. ఫైన్‌తో లాస్ట్ డేట్ 20/5/2024. ఫోన్: 8019383310
AJH-002326

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 99854 10640
జగిత్యాల :- సెల్: 99854 11262
మెట్‌పల్లి :- సెల్: 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు

- అన్నదాతలను వేధిస్తున్న లారీల కొరత
- ఆకాశంలో మబ్బులతో ఆందోళన



మూడపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

చందుర్తి, మే 17: అన్నదాతలను అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. పంట వేసింది మొదలు అమ్ముకునే వరకు అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యం, ఆకాశం మబ్బులు పడుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. ధాన్యం తూకాలు, బస్తాలను రైస్‌మిల్లులకు తరలింపులో ఆలస్యంతో కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. లారీల కొరతతో ధాన్యం రాశులు కదలడం లేదు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో లారీలు అన్‌లోడ్ కావడానికి మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతోంది. దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదంటూ లారీల యజమానులు, డ్రైవర్లు బస్తాకు రూ. 1 నుంచి 3 వరకు రైతుల వద్ద వసూలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తప్ప పేరిట బస్తాకు గరిష్ఠంగా కిలో అదనంగా తూకం వేస్తుండగా తరుగు పేరిట మిల్లర్లు కోత విధిస్తున్నారు. ధాన్యం విక్రయాల్లో తూకాలు మొదలు కొని, బస్తాల రవాణా, మిల్లులకు దింపుకునే వరకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రాలు ప్రారంభమై 36 రోజులు దాటుతున్నా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికావడంలేదు. ధాన్యం సేకరణకు చందుర్తి ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం కింద 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఈ నెల 16 వరకు 650 రైతుల నుంచి మంది 90 వేల క్వింటాళ్ల 553 కిలోల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 78 వేల 478 క్వింటాళ్లను రైస్ మిల్లులకు చేర్చగా 12 వేల 75 క్వింటాళ్ల ధాన్యాన్ని తరలించాల్సి ఉంది. మరో 40 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని తూకం వేయాల్సి ఉంది. తూకాలు, మిల్లులకు బస్తాల తరలింపులో జాప్యంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులుకాస్తున్నారు. కేంద్రాల్లో ఒక్కో చోట ఒక్కో రకంగా ధాన్యాన్ని తూకం వేస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తాలు, తప్ప పేరిట 40 కిలోల బస్తాకు 3 నుంచి 5 కిలోలను అదనంగా తూకం వేస్తున్నారు. ధాన్యం బస్తాలు మిల్లులకు చేరగానే తరుగు పేరిట మిల్లర్లు బస్తాకు 3 నుంచి 5 కిలోల కోత విధిస్తున్నారు. వడగళ్లు, అకాల వర్షాలకు పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోగా ధాన్యం విక్రయాల్లో అందరి చేతిలో మోసపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్లు కోత విధిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని వాపోతున్నారు.

తూకంలో మోసం

- చిలుక అంజిబాబు, మాజీ సర్పంచ్, మూడపల్లి



కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తాలుతప్ప పేరిట 40 కిలోల 600 గ్రాముల బస్తాలో అదనంగా ఒక కిలో తూకం వేస్తున్నారు. ధాన్యం బస్తాలను మిల్లులకు చేరగానే తరుగు పేరిట ఒక లారీ లోడుకు మిల్లర్లు ఒక రైతుకు 5 నుంచి 10 బస్తాల వరకు కోత విధిస్తున్నారు. రైస్ మిల్లర్లూ కోత పెడుతున్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి

- బొప్ప లచ్చయ్య, రైతు, మూడపల్లి



నాకు ఉన్న 4 ఎకరాల భూమిలో వరి వేశాను. 14 రోజుల క్రితం కోయించి, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. గన్నీ సంచులు, లారీల కొరతతో తూకం వేయడంలో జాప్యం జరుగుతోంది. పంట పండించడం ఒక్క ఎత్తయితే విక్రయించడం మరో ఎత్తవుతోంది. ధాన్యం కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలి.

రూ.7,190 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,190 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు రైతులు 95 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చారు. వ్యాపారులు గరిష్ఠ ధర 7,190 రూపాయలు, కనిష్ఠ ధర ఐదు వేల రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 17: మండలంలో వెంకటాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. వాహనాన్ని స్వాధీన పర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

అకాల వర్షంతో నష్టం

● తడిసిన ధాన్యం ● విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కురిసిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి.

మెట్‌పల్లి రూరల్, మే 17: మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● ఇబ్రహీంపట్నం: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, గోధుర్, వేములకుర్తిలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● కథలాపూర్: మండలంలోని చింతకుంట, ఊట్‌పల్లి, పెగ్గెర్ల, భూషణరావుపేట, దుంపెట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి.

● మల్యాల: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రామన్నపేట, మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, లంబాడిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం తడిసింది.

● వేములవాడ టౌన్: మండలంలో శుక్రవారం భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్టు విరిగి రోడ్డుపై పడింది. వేములవాడ మండలం ఆరెపల్లి సమీపంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని తుమ్మచెట్టు విరిగి రోడ్డుపైన పడింది. ఆ సమయంలో రోడ్డుపైన వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కరీంనగర్-వేములవాడ ప్రధాన రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

● కోనరావుపేట: మండలంలో కురుస్తున్న వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. లారీల కొరతతో ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతోంది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

● ధర్మారం: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. రోడ్లన్నీ బురదమయమయ్యాయి. వర్షం కారణం గా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

● మంథని/మంథని రూరల్: మండలంలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో, వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం తడిసింది. మండలంలోని ఆరెంద, వెంకటాపూర్, మల్లారంతో పాటు పలు గ్రామాల్లో ఇంకా కోయని పొలాలు నేలకొరిగాయి. ఖానాపూర్ గ్రామంలో గాలి దుమారానికి ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడడంతో అమ్మకుంటి సమ్మయ్య అనే రైతుకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

● కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారు జామున 4గంటల వరకు కురిసింది. భారీ వర్షంతో రామగుండంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు 2.5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


మెట్‌పల్లి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం


ధర్మారంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు


వేములవాడ మండలం ఆరెపల్లిలో రోడ్డుపై విరిగి పడిన తుమ్మచెట్టు


రుద్రంగిలో ధాన్యం కుప్పలు చుట్టూ చేరిన వర్షపు నీరు

పూర్తి స్థాయిలో పనులు కల్పించాలి

● ఉపాధి కూలీల ఆందోళన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

కోరుట్ల రూరల్, మే 17: తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ గ్రామ శివారులోని నర్సింహులుకుంట, బూర్గం కుంటల మాటు కాల్వల పూడికతీతతో పాటు ఇతర పనులను చేస్తుండగా ఆ ప్రాంతం లోని రైతులు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో తాము పని దినాలను కోల్పోతున్నామని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తెచ్చేందుకే ఆందోళనకు దిగామన్నారు. తహసీల్దార్ కిషన్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. చేయవలసిన పనుల కోసం సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి పనులు కల్పిస్తామని తెలపడంతో కూలీలు ఆందోళన విరమించారు.

పాత కక్షలతో దాడి: ఇద్దరి మృతి


శ్రీనివాస్, మహేష్ (ఫైల్)

బుగ్గారం మే 17: జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలో పాత కక్షలు పురి విప్పాయి. పాత పగలు మనసులో పెట్టుకుని మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన దిటి శ్రీనివాస్(36), దీటి మహేష్ (38)పై అదే గ్రామానికి చెందిన బుర్ర నవీన్‌తో పాటు కొంత మంది కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాస్, మహేష్ మృతి చెందారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర నవీన్, దీటి శ్రీనివాస్ పక్క పక్క ఇళ్లలో నివసిస్తుంటారు. ఆ రెండు ఇళ్ల మధ్యలో ఉన్న ఇంటిని రెండేళ్ల క్రితం శ్రీనివాస్ కొన్నాడు.

ఆ ఇల్లు తనకు కావాలంటూ నవీన్ తరచూ శ్రీనివాస్‌తో గొడవ పడేవాడు. ఇదే విషయమై గ్రామం లో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. ఇది మనసులో పెట్టుకున్న నవీన్ మరి కొందరితో కలిసి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి బయట పడుకున్న శ్రీనివాస్‌తో పాటు అతని బంధువు దీటి మహేష్‌లపై కర్రలతో దాడి చేశాడు. శ్రీనివాస్, మహేష్ అరుపులకు ఇరుగు పొరుగు వారు రావడంతో నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయరు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న మహేష్‌ను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మహేష్ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీటి శ్రీనివాస్‌కు వివాహం జరిగింది. మహేష్‌కి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. శ్రీనివాస్ చెల్లెలు మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల శిబిరాలు
● పాల్గొంటున్న 500 మంది క్రీడాకారులు



కరీంనగర్‌లో క్రికెట్ శిక్షణ పొందుతున్న బాలికలు, బ్యాటింగ్ చేస్తున్న బాలుడు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 17: వేసవి సెలవుల్లో క్రికెట్ శిక్షణపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు కేంద్రాల్లో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. కేడీసీఏ ఆరు సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలు నిర్వహించలేదు. ఈ యేడాది హెచ్‌సీఏ, కేడీసీఏ శిబిరాలను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. అండర్- 14, అండర్-16, అండర్-19, అండర్-23 వయసు విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఉదయం 5 నుంచి 8.30 వరకు శిక్షణ ఇస్తున్నారు. కరీంనగర్‌లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదుట ఉన్న జిల్లా క్రికెట్ సంఘం మైదా నంలో, సెయింట్ ఆల్ఫోన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. గోదావరిఖనిలోని జీఎం గ్రౌండ్‌లో, సిరిసిల్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. అత్యధికంగా గోదావరిఖనిలో 200 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతుండగా కరీంనగర్‌లో 160 మంది, సిరిసిల్లలో 140 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. క్రీడాకారులకు మూడు శిక్షణ కేంద్రాల్లో శిక్షణ అనంతరం హెచ్‌సీఏ సౌజన్యంతో అరటి పండ్లు, కోడి గుడ్లు, హెల్త్ డ్రింక్స్ అందిస్తున్నారు. కరీంనగర్‌లో డి.శ్రీనివాస్, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, మరో ముగ్గురు కోచింగ్ ఇస్తున్నారు. గోదావరిఖనిలో కిరణ్, సుదేశ్‌కుమార్, సిరిసిల్లలో ప్రసాద్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

● శిబిరాలను సందర్శించిన హెచ్‌సీఏ కమిటీ

ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను సందర్శించారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షులు ఈ కమిటీలో ఉన్నారు. రాష్ట్రంలో క్రికెట్ క్రీడాభివృద్ధికి, క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.


● శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- వి ఆగంరావు, కేడీసీఏ అధ్యక్షుడు



హెచ్‌సీఏ సహకారంతో కేడీసీఏ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, ఔత్సాహిక యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరాల్లో శిక్షణకుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతంలోని అత్యుత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయి.

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES Through GANESH BHARI 9299992173

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI PICTURES RELEASE 9885291789

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.30,6.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్ 11.30am

NTR CINEMAS & RUSHIKESHWAR FILMS 9030161717, 9849076540

విజయవంతమైన 3వ వారం



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 1.00,2.00,6.00,9.00

GLOBAL CINEMAS LLP

నేడే చూడండి



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 8.00,2.30,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

CONTACT 7799120222

SUPER HIT నేడే చూడండి



దేవి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SHIVA SAI FILMS

విజయవంతమైన 3వ వారం



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

GLOBAL CINEMAS LLP

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

● రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలు

● అధికారుల హామీతో ధర్నా విరమణ

రాయికల్, మే 17: ధాన్యం కొనుగోలు జాప్యంతో పాటు తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో రాయికల్-మైతాపూర్ రోడ్డులో రైతులు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సొసైటీ కొనుగోలు కేంద్రం నిర్లక్ష్యంతో రోడ్డుపైకి రావాల్సి వస్తుందని, కేవలం ఆరుగురు హమాలీలతో ధాన్యాన్ని తూకం వేస్తున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని లారీల కొరత ఉందంటూ మిల్లుకు తరలించకపోవడంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షంతో తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోను ప్రశ్నించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాప్యంతో ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని, త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని సొసైటీ అధికారులకు అనేకసార్లు మొర పెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ప్రతి సంవత్సరం రోడ్డు ఎక్కాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోళ్లు జరిపి ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రైతుల ఆందోళన సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య, ఏఎస్సై దేవేందర్ పది రోజుల్లో కల్లాల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఈవోకు సూచించి రైతులకు నచ్చజెప్పడంతో నిరసనను విరమించారు. రైతుల ధర్నాతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.




రాయికల్-మైతాపూర్, కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

● వేములవాడ మండలం అనుపురంలో..

వేములవాడ టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్న కొనుగోలులో జాప్యం చేస్తున్నారని వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. నాంపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో అనుపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 రోజులుగా కొనగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండుసార్లు వర్షానికి తడిసాయని, ఇప్పటికి ధాన్యం కొనుగోలు చేయకోవడంతో గ్రామానికి చెందిన రైతుల ధాన్యం బస్తాలతో సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వేములవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీచ్చారు. దీంతో రైతులు శాంతించి ధర్నాను విరమించారు.

● నాంపల్లి ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని, అనుపురం గ్రామంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని ఇక్కడి బీఆర్‌ఎస్ నాయకులు కావాలని రాజకీయం చేస్తున్నారని సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి ఆరోపించారు. అనుపురం రైతులు ధర్నా చేశారని తెలుసుకున్న సల్మాన్‌రెడ్డి అనుపురం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఘనంగా గంగాదేవి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్రులు

రాయికల్, మే 17: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని పెద్ద చెరువు గట్టు మీద నెలకొన్న గంగాదేవి ఆలయంలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాశివుని కల్యాణోత్సవం కోసం హోమం నిర్వహించారు. చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేక అని వారు తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కామని రజనీ కుమార్, కార్యదర్శి హరీష్ కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, సభ్యులు మాసపేట మల్లయ్య, వెంకట్రాజం, కామని లక్ష్మయ్య, సూర్యప్రకాశ్, రాజేశం, భూమరాజం, నరేష్, రమేష్, అరవింద్, ప్రభాస్, రాజ్ కుమార్, చిన్న నర్సయ్య, గంగాధర్, మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, మే 17: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మొదటి దఫా అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా 100 రూపాయల రిజిస్ట్రేషన్‌తో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 16 నుంచి జూన్ 10వరకు స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరెళ్లలో మూడిళ్లలో చోరీ

ధర్మపురి, మే 17: మండలంలోని నేరెళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కంతి మహేష్ ఇంటిలో ప్రవేశించి రూ 2.35 లక్షలు నగదు, కంతి నరేష్ ఇంటిలో తులంనర బంగారు ఆభరణాలు, బొనగంటి రాజవ్వ ఇంటిలో 20 తులాల వెండి, అర తులం బంగారం, ఐదు వేలు నగదును అపహరించారు. రాత్రి వేళలో ఆ ముగ్గురు వ్యక్తులు ఇంటిలో పడుకుని ఉన్న సమయంలో వచ్చిన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు.

ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి



పొన్నం కవిత (ఫైల్)

వేములవాడ టౌన్, మే 17: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం కవిత (36) అనే మహిళకు మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే వుంటుంది. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోయిన కవిత ఫిట్స్‌తో నాంపల్లి గ్రామంలో మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి మతిస్థిమితం సరిగా ఉండదని, ఫిట్స్, మూర్చ వ్యాధితో బాధపడుతుందని కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఆటో బోల్తా : ఇద్దరు డ్రైవర్ల మృతి



చెలకని రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 17: పెద్దపల్లి జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలంలో ఆటో బోల్తా పడి ఇద్దరు డ్రైవర్లు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్-పెద్దరాతుపల్లి గ్రామాల మధ్యన ఉన్న మట్టలవాగు బ్రిడ్జివద్ద ఆటో బోల్తాపడి ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో మహిళకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు, బీస రజిత కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్‌లో గురువారం జరిగిన వారసంతలో కూరగాయలు అమ్ముకొని స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి పెద్దరాతపల్లి మట్టలవాగు బ్రిడ్జి వద్ద ప్రమాదావ శాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందగా, రజితకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ ఓంకార్ యాదవ్ చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాజుకు భార్య భవాని, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని పాలితం గ్రామానికి చెందిన ఆలేటి భూమయ్య (42) ఆటోడ్రైవర్ ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుతూ జీవనం సాగించే భూమయ్య శుక్రవారం యథావిధిగా పాలితం గ్రామం నుంచి పెద్దపల్లికి ప్యాసింజర్‌లను తీసుకోచ్చి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పాలితం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడటంతో ఆటోలో ఉన్న డ్రైవర్ భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరని తెలిపారు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

బిల్లుల కోసం గ్రామ పంచాయతీకి తాళం

గంభీరావుపేట, మే 17: అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్ది మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు ఈజీఎస్ పథకం కింద గ్రామ పంచాయతీ భవనం మంజూరవడంతో రూ.20 లక్షలతో నిర్మించారు. మరో ఎనిమిది లక్షల రూపాయలను గ్రామాభివృద్ధికి వెచ్చించారు. ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వకుండా సర్పంచులను నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. సర్పంచుల గౌరవ వేతనం కూడా మూడు సంవత్సరాలది పెండింగ్‌లో ఉన్నదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఐదు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులుగానీ, సర్పంచుల పెండింగ్ బిల్లులు గానీ విడుదల చేయలేదన్నారు. బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

సౌత్ ఆఫ్రికాలో కొత్తపేట వాసి మృతి

ఎండపల్లి, మే 17: ఉపాధి నిమిత్తం సౌత్‌ఆఫ్రికా వెళ్లిన మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగట్టు సత్తయ్య(43) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం సౌత్ ఆఫ్రికాకు వెళ్లాడు. 20 నెలల క్రితం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి గడిపాడు. ఇటీవలే మళ్లీ వెళ్లాడు. శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడి గదిలోనే మృతి చెందాడు. సత్తయ్య సోదరుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. సత్తయ్యకు భార్య పద్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

కొండగట్టులో కానరాని 'క్యాష్ లెస్' సేవలు

● మూలన పడ్డ స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డులు

● అసౌకర్యానికి గురి అవుతున్న భక్తులు

మల్యాల, మే 17: ఆన్‌లైన్ సేవల కాలమైన నేటి రోజుల్లో ప్రజలు అత్యధికంగా 'క్యాష్ లెస్' లావాదేవీపై ఆధారపడగా ప్రతీ చోట క్యాష్‌లెస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొండగట్టు అంజన్న క్షేత్రంలో మాత్రం భక్తులు క్యాష్‌లెస్ సేవలకు నోచుకోవడం లేదు. దీంతో భక్తులు డబ్బుల కోసం కొండపైన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయిదేళ్ల క్రితం దేవస్థానం అధికారులు స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ స్కానర్‌సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొన్నేళ్ల క్రితం కార్డులు ఎక్కువ వినియోగించగా వాటి కోసం స్వైపింగ్ యంత్రాలను దేవస్థానం పరిధిలోని బుకింగ్ తదితర చోట్ల ఏర్పాటు చేశారు. అయితే అవి మున్నాళ్లకే అటకెక్కాయి. కాగా ఇటీవల యూపీఐ లావాదేవీలు పెరుగడంతో రెండేళ్ల క్రితం ఆలయంలో భక్తులు స్వామి వారికి చెల్లించుకునే కానుకలను సమర్పించడానికి గాను క్యూఆర్ కోడ్ స్కానర్ బోర్డులు పెట్టారు. అవి కూడా ఇటీవల మూలనపడ్డాయి. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆన్‌లైన్ సేవల్లో భాగంగా నగదు రహిత లావాదేవీల నిర్వహణకు ఏర్పాటు చేసిన స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డుల నిర్వహణ కొరవడడం, అవి పని చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణాలు, నగరాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. నగదురహిత సేవలకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతన్నారు.

● ఉచిత వైఫై మేలు..

కొండగట్టు కొండపైన సెల్‌ఫోన్ సేవలు నామమాత్రమే. ఇక్కడ సెల్‌ఫోన్ సేవలను విస్తృతంగా అందించేందుకు సెల్ సంస్థలు ముందుకు రాకపోవడంతో అంతంత మాత్రమే అందుతున్న సెల్ సేవలతో ఇబ్బందులు పడుతున్న భక్తులు.. క్యాష్‌లెస్ సేవలకూ సెల్‌సేవలు విఘాతంగా మారుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ఉచిత వైఫై సేవలపై దృష్టి సారించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దేవస్థానానికి కోట్లాదిగా ఆదాయం భక్తుల ద్వారా వివిధ మార్గాలో సమకూరుతుండగా పలు టికెట్లు, ప్రసాదాలు, వాహన పూజలు తదితర వాటి ద్వారా నగదు లావాదేవీలు జరుగుతుంటాయి. అధికారులు నగదురహిత సేవల కోసం ఉచిత వైఫై సమకూర్చే అవకాశం మెండుగా ఉన్నా అటువైపుగా దృష్టి సారించడం లేదు.



ఆలయంలో ఓ మూలన ఉన్న క్యూఆర్ కోడ్ బోర్డు

● చర్యలు తీసుకుంటాం

చంద్రశేఖర్, ఆలయ ఈవో

కొండగట్టులో భక్తులకు క్యాష్‌లెస్ సేవలు అందించడానికి గాను తగుచర్యలు తీసుకుంటాం. యూపీఐ సేవలు అందుబాటులో తీసుకురావడంపై దృష్టి సారిస్తం. సెల్‌సేవలు అందించే సేవలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నపాటి కొద్ది సిగ్నల్స్ క్యాష్‌లెస్ సేవలకు అందక ఆన్‌లైన్ సేవలకు అసౌకర్యంగా మారుతోంది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోనే పరిస్థితి నెలకొంటుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్




మాట్లాడుతున్న డా. శ్రీధర్, బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, మే 17: ఇంజనీరింగ్ విద్యార్థులు లక్ష్య సాధనతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి జేఎన్ టీయూ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్లాస్‌లకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటానికి కమ్యూనికేషన్స్ నైపుణ్యతను మరింత పెంచుకోవాలన్నారు.

అంతకు ముందు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్ ప్రారంభ ఉపన్యాసంతో వేదికపైకి అందరిని ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ కళాశాల 2023-2024 నుంచి పదేళ్ల పాటు అటానమస్ ప్రతిపత్తి పొందిందన్నారు. కళాశాలలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం అకాడమిక్ ప్రైజెస్, స్పోర్ట్స్, గేమ్స్ ప్రైజెస్ అందించారు. యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించిన నలుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. బెస్ట్ స్టూడెంట్ అవార్డు సాదించిన జి తేజస్వినికి ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి



కర్రోళ్ల రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ మాజీ మండల అధ్యక్షుడు కర్రోళ్ల రాజు (38) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. చీకటి పడడం వల్ల ఎవరూ గమనించకపోవడంతో ఆయన మృతదేహం ఎనిమిది గంటల పాటు ఘటన స్థలంలోనే పడి ఉందని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన రాజు తన బైక్‌పై ఈ నెల 16న సాయంత్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి వచ్చా డు. తిరుగు ప్రయాణంలో రాత్రి మండలంలోని కోరుట్లపేట శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దాంతో రాజు ఎగిరిపోయి పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో పడి మృతి చెందాడు. ఉదయం పొలాల వద్ద కు వెళ్లిన రైతులకు మృతదేహం కనిపించడంతో సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి నర్మాలకు చెందిన రాజుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రాజు తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు. మృ తుడికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు. రాజు కొంత కాలంగా బీఎస్పీ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతు న్నాడు. రెండు పర్యాయాలు బీఎస్పీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. రాజు మృతిపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

రామడుగు, మే 17 : తమ్ముళ్లపై దాడి చేసిన అన్న, అతని కుమారుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దత్తోజీపేట గ్రామానికి చెందిన తోట్ల రాములు, తోట్ల మల్లయ్య, తోట్ల ముత్తయ్య ముగ్గురు అన్నదమ్ములు కాగా గత కొంత కాలంగా వ్యవసాయ భూమిపై గొడవలు జరుగుతున్నాయి. అందులో బాగంగా గురువారం రాత్రి గ్రామ శివారులో ముత్తయ్య, మల్లయ్యలు మోటార్ సైకిల్‌పై వెల్లుతుండగా అన్న రాములు, అతని కుమారుడు తోట్ల మహేందర్‌లు కర్రలతో దాడికి పాల్పడగా గాయాల పాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్య కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

గోదావరిఖనిలో తల్లీకూతుర్ల అదృశ్యం


కోల్‌సిటీ, మే 17: గోదావరిఖని భరత్‌నగర్‌కు చెందిన దాసారపు రజిత(23) అనే వివాహిత, ఆమె కూతురు అనన్య (21నెలలు)ను తీసుకుని గురువారం ఉదయం నుంచి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. భార్యభర్తల మధ్య గొడవ జరుగగా మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఆమె తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712656516, ఎస్ఐ టీ శ్రీనివాస్ 9010072555కి సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు.

అధిక లోడు.. అవస్థలు చూడు!



అధిక లోడుతో వెళుతున్న లారీకి అడ్డు తగిలిన తీగలు

ఎల్లారెడ్డిపేట, మే 17: అసలే కిందకు వేలాడుతున్న తీగలు.. భారీ వాహనాలు వెళితే మరో వాహనం ప్రయాణించేందుకు కష్టంగా ఉన్న రోడ్డు.. ధాన్యం బస్తాలు నింపుకుని అధిక లోడుతో వెళుతున్న లారీకి కరెంటు స్తంభాల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యుత్తు సర్వీస్ తీగలు అడ్డు తగిలాయి. అడుగడుగునా తీగలు అడ్డురావడంతో లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపి పైకెక్కి తీగలను సరి చేసి మళ్లీ ముందుకు సాగాడు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డులో అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ వల్ల శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక లోడుతో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తమ ఇళ్ల సరఫరా అయ్యే విద్యుత్తు సర్వీస్ తీగలు తెగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్డు వెంట అధిక లోడుతో వచ్చే వాహనాలను అనుమతించకూడదని కోరుతున్నారు.



తీగలను తీసేందుకు ఇబ్బంది పడుతున్న వాహన డ్రైవర్

బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

ఎండపల్లి, మే 17: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆర్టీసీ బస్సును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న దాదాపు వంద మందికి ప్రాణాపాయం తప్పింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కరీంనగర్ నుంచి మంచిర్యాలకు వెళుతున్న టీఎస్ 02 యూఏ 3672 అనే నంబర్ గల బస్సు మండలంలోని కొత్తపేట గ్రామానికి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను తప్పించబోయి బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఒకేసారి పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.

గంభీరావుపేటలో విషాదం

గంభీరావుపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గంభీరావుపేట మండలంలో విషాదం అలుముకుంది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్‌పీ నేత కర్రోల్ల రాజు కోరుట్లపేట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు రాజు అనేక సమస్యలపై ప్రజలతో కలిసి ఉద్యమించాడు. బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశాడు. కర్రోల రాజు ఆకస్మిక మరణం తన సొంత గ్రామమైన నర్మాలతో పాటు మండల వ్యాప్తంగా విషాద చాయలు చోటు చేసుకున్నాయి. బీఎస్‌పీ శ్రేణులు, స్నేహితులు, బంధువులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు రాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పూర్ణాహుతి.. సహస్ర కలశాభిషేకం

- కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు - స్వామి వారలను దర్శనం చేసుకున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



అభిషేకం కోసం కలశం తీసుకెళ్తున్న ఆలయ ముఖ్య అర్చకులు

ధర్మపురి, మే 17: ధర్మపురి క్షేత్రంలో ఐదో రోజు శుక్రవారం నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనాది ఆరాధన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండలి, స్థాపిత దేవతా పూజలు అనంతరం స్వామివారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. లోక క్షేమార్థం యాగశాల వద్ద అర్చకులు హోమం నిర్వహించారు. స్వామి వారలను అందంగా అలంకరణ చేశారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచార్యా, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ పరిధిలో రైతులకు విస్తృత సేవలు



విలీన పత్రాన్ని అందజేస్తున్న పాలకవర్గం

సిరిసిల్ల రూరల్, మే 17: కేడీసీసీ బ్యాంక్ పరిధిలోని రైతులకు విస్తృత సేవలు అందిస్తున్నట్లు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ సింగిల్ విండో ఇప్పటి వరకు సిరిసిల్ల ఎస్‌బీఐ పరిధిలో ఉండి రైతులకు రుణాలు అందించింది. ఇటీవల సింగిల్ విండో మహాసభలో ఎస్‌బీఐ నుంచి కేంద్ర జిల్లా సహకరబ్యాంక్ పరిధిలోకి మారాలని కొండూరు రవీందర్‌రావు ఇచ్చిన పిలుపుతో పాలకవర్గం తీర్మానం చేసింది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే శుక్రవారం కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ కార్యాలయంలో కొండూరు రవీందర్‌రావును కలిసి ఎస్‌బీఐ నుంచి కేడీసీసీబీలో సింగిల్ విండోను విలీనం చేస్తున్నట్లు చేసిన తీర్మానాన్ని అందించారు. ఈ సందర్భంగా కొండూరు రవీందర్‌రావు మాట్లాడారు. కేడీసీసీ బ్యాంక్ నుంచి రైతులకు వ్యవసాయ రుణాలతోపాటు వ్యక్తిగత రుణాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సింగిల్ విండోతోపాటు బ్యాంక్ మనుగడకు తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారపు నారాయణగౌడ్, డైరెక్టర్లు సలేంద్రీ బాలరాజుయాదవ్, నాయకులు ముష్కం సత్తయ్య, సీఈవో చిలుక గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా కూరగాయల మార్కెట్



వేములవాడలో నిర్మించిన కూరగాయాల మార్కెట్ భవనం

- రూ.2.90 కోట్లతో నిర్మాణం
- నూతన భవనంలోకి వెళ్లని వ్యాపారులు
- పది దరఖాస్తులే రావడంతో నూతన భవనానికి తాళం
- రెండో బైపాస్‌లో కొనసాగుతున్న మార్కెట్

వేములవాడ టౌన్, మే 17 : వేములవాడలో నిర్మించిన కూరగాయాల భవనం అలంకారప్రాయంగా మారింది. వేములవాడ పట్టణంలో రైతులు, వ్యాపారులు కూరగాయాలు విక్రయించుకునేందుకు వీలుగా అప్పటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణం చేపట్టింది. పోలీస్ స్టేషన్ ఎదుట గర్ల్స్ హైస్కూల్ పక్కన 10 వేల అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.2.90 కోట్లతో భవనం పనులు పూర్తి చేశారు. వ్యాపారులు మాత్రం నూతన భవనంలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో భవనానికి తాళం వేశారు. గతేడాది ఫిబ్రవరిలో పనులు పూర్తయినా ప్రారంభోత్సవంలో ఆలస్యమైంది. గత సంవత్సరం ఆగస్టులో అప్పటి మంత్రి చేతుల మీదుగా కూరగాయాల మార్కెట్ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి రైతులకు, వ్యాపారులకు కూరగాయాల మార్కెట్‌లో స్టాల్స్ కేటాయించలేదు. దీంతో పార్లమెంట్ ఎన్నికలకు ముందు స్టాల్స్ కేటాయించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. వ్యాపారులు ఆసక్తి కనబర్చ లేదు. పది మంది మాత్రమే ముందుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో గత ఆగస్టు నుంచి నూతన భవనానికి తాళం వేశారు.

కరోనా సమయంలో తరలింపు

ఉప్పుగడ్డ వీధిలో కొనసాగుతున్న కూరగాయాల మార్కెట్‌ను కరోనా సమయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అక్కడి నుంచి తరలించారు. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో కూరగాయాల వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో చేసేది లేక రెడో బైపాస్ రోడ్డులోని మూలవాగు ఒడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేయగా మరికొందరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదుట రోడ్డుకు ఇరువైపుల కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. దీంతో పట్టణ వాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని నూతన మార్కెట్ భవనాన్ని ఆగమేఘాల మీద నిర్మాణం చేపట్టారు.

సమన్వయ లోపం

గత ప్రభుత్వం ఆధ్వర్యంలో కూరగాయాల మార్కెట్‌లోని వ్యాపారులతో అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మాట్లాడి నూతన మార్కెట్ భవనాన్ని నిర్మాణానికి అంగీకారం తెలిపారు. సుమారు రూ. 2.90 కోట్లతో నిర్మించారు. ప్రస్తుతం మున్సిపల్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించగా కేవలం పది మంది మాత్రమే నూతన భవనంలోకి వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారు. రెండో బైపాస్‌లోని కూరగాయాల మార్కెట్‌లో వర్షానికి, ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరికొంత మంది బైపాస్ రోడ్డును వదిలేది లేదని తేల్చిచెబుతున్నారు. సంబంధిత అధికారులు వ్యాపారులతో సమన్వయపరిచి నూతన భవనంలోకి తరలించాల్సి ఉందని చర్చించుకుంటున్నారు.



రెండో బైపాస్‌లో కొనసాగుతున్న కూరగాయాల మార్కెట్

వ్యాపారులకు అవగాహన కల్పించాలి

- పోతు అనిల్, వేములవాడ



వ్యాపారులు అంగీకరిస్తేనే నూతన మార్కెట్ భవనాన్ని నిర్మించారు. కోట్లు పెట్టి పనులు పూర్తి చేశాక వెళ్లబోమని చెప్పడం విడ్డూరం. అధికారులు చొరవ చూపి వ్యాపారులతో మాట్లాడాలి. అవగాహన కల్పించి నూతన భవనంలోకి తరలించాలి. మున్సిపల్ అధికారులు మరోసారి దరఖాస్తులు స్వీకరించాలి. స్టాల్స్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలి.

మరోసారి దరఖాస్తులు తీసుకుంటాం

- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ.



నూతన మార్కెట్ భవనాన్ని గతేడాది ఆగస్టులో ప్రారంభించాం. పలు మార్లు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో వ్యాపారులను సంప్రదించాం. దరఖాస్తులు ఆహ్వానించగా కేవలం పది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. పూర్తి స్థాయిలో వ్యాపారులకు అవగాహన కల్పించి మరోమారు దరఖాస్తులు ఆహ్వానిస్తాం.

అధికారంలో ఉండి రైతులకు చేసిందేమిటి?



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, మే 17: పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందని, ఆ పార్టీ చేస్తున్న ఊసరవెల్లి రాజకీయాలను అన్నదాతలు గమనిస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదవి పోగానే ప్రజలు, రైతులు గుర్తుకు వస్తున్నారన్నారు. రైతులపై కపట ప్రేమ చూపుతూ ఆందోళనలు, నిరసనలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటిస్తే అసత్య ప్రచారానికి బీఆర్‌ఎస్ తెరదీసిందన్నారు. రైతులు పండించిన దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పలేదని, ఆ విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు గమనించాలని సూచించారు. తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే పనికి బీఆర్‌ఎస్ ఒడిగట్టిందని ధ్వజమెత్తారు. రైతులను అన్ని విధాలుగా కాంగ్రెస్ సర్కారు ఆదుకుంటోందన్నారు. కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో డిపాజిట్ రాదని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొనడం సరికాదన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీలోనే లేదనే విషయాన్ని ముందే గుర్తించారని, వారి ఉనికి కోసం ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఫలితాల వరకు వేచి చూడాలని దొమ్మాటి నర్సయ్య సూచించారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, బాబు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, రాంరెడ్డి ఉన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



పెద్దూర్‌లో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు, నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, మే 17: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి కేంద్రాన్ని మూసివేశారు. అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అధికారులు అయా కేంద్రాలకు కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడిన బాధితులు నర్సింహారెడ్డి, గాంధీబాబును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. తిమ్మాపూర్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి వ్యవసాయ బావి పడి మృతి చెందిన నిరుపేద గడ్డి రమేశ్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు సమకూర్చిన రూ.5 వేల నగదును బాధిత కుటుంబాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, బాల్‌రెడ్డి, కార్తీక్, బీఆర్‌ఎస్ నాయకులు రాజయ్య, శేఖర్, రాజునాయక్, అంజయ్య, లింగనాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరవకముందే వసతులు కల్పించాలి

- 20 రోజుల వ్యవధిలో పనులు పూర్తి చేయాలి
- ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 17: పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పి.గౌతమి, ఖీమ్యానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్‌లు, ఇతర ఉన్నతాధికారులు ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ ఏర్పాటు చేసి మౌలిక వస్తువుల పనులను గ్రౌండ్ చేసినట్లు చెప్పారు. పాఠశాలల పునః ప్రారంభానికి మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో బాలికల సంఖ్య ప్రకారం ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పేయింటింగ్ వేయాలన్నారు. మంజూరు చేసి ఇప్పటివరకు గ్రౌండ్‌కాని పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూని ఫామ్ జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు 17 జిల్లాలకు చేరిందని, మరో 3 రోజులలో మిగిలిన జిల్లాలకు యూనిఫామ్ బట్ట చేరుతుందని తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫాం సిద్ధం చేయాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం లక్ష్యంగా మార్చి 15 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15 వేల దరఖాస్తులను పరిష్కరించామని, లోక్ సభ పోలింగ్ ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునః ప్రారంభించాలని అన్నారు. మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులలో అధికంగా రెవెన్యూ ధరణి సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, వీటి ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో జూన్ 7వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేశామని, ప్రజావాణి కార్యక్రమం పునః ప్రారంభానికి ముందే పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అన్నారు. లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఉన్నప్పటికీ రికార్డు సమయంలో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాల్సి ఉందని, వీటిని సత్వరమే కొనుగోలు చేయాలని అన్నారు. ఐదురోజులపాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు ఎట్టి పరిస్థితులలో నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ప్రారంభించామని, చివరి దశలో పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు పురోగతి అంశాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ జితేంద్ర ప్రసాద్, మార్కెటింగ్ శాఖ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, డీఈవో రమేష్ కుమార్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ తగ్గింపు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

సిరిసిల్ల రూరల్ మే 17: బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు అందించే 10 శాతం యారన్ సబ్సిడీని చేనేత జౌళి శాఖ అధికారులు తగ్గించడం అన్యాయమని ఇండియన్ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవర్‌లూం కార్మికులకు 2022, 2023 సంవత్సరాలకు సంబంధించి రావాల్సిన బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ చేనేత జౌళి శాఖ కమిషనర్ ఒక మీటర్‌కు 40 పైసలు తగ్గించి ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. ఇది కార్మికుల శ్రమను దోచుకోవడమేనని, సీఐటీయూ ఖండిస్తోందని అన్నారు. గతంలో ఇచ్చిన మాదిరిగానే మీటరుకు రూ.1.42 పైసలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక మీటరుకు 40 పైసలు తగ్గించడంతో కార్మికులు రెండు కోట్ల రూపాయలు కష్టార్జితం కోల్పోతున్నారన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై కక్ష సాధింపు ధోరణి కొనసాగిస్తున్నారని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను మొత్తం లేకుండా చేసే విధంగా ఆమె చర్యలు కనిపిస్తున్నాయని అన్నారు. మే 20న చేనేత జౌళి శాఖ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జిల్లా నాయకులు దేవదాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

- కేంద్ర సాయుధ బలగాలతో 24 గంటల కాపలా
- సీసీ కెమెరాలతో నిఘా, 144 సెక్షన్ అమలు
- ప్రతీ రోజు ఎన్నికల అధికారి, పోలీసు అధికారుల తనిఖీ

కరీంనగర్ క్రైం, మే 17: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కీలకమైన పోలింగ్ పర్వం ముగియడంతో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కరీంనగర్, హుజురాబాద్, చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 2,194 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను సీల్ చేయటమే కాకుండా మూడంచెల భద్రతలో భాగంగా గదుల ఎదుట మొదటి దశలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో దశలో కళాశాల భవనంలోని అన్ని ద్వారాల వద్ద ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్)బలగాలు, మూడోదశలో కళాశాల ప్రధాన గేట్‌తో పాటు కళాశాల ప్రహరీ చుట్టూ స్థానిక సివిల్ పోలీసులను మోహరించారు. స్ట్రాంగ్‌రూంలు భద్రపరిచిన ఎస్సారార్ కళాశాల ప్రాంతంలో చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు. ఇక్కడ 24 గంటల పాటు పోలీసు గస్తీని కూడా ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజు ప్రత్యేక టీంలతో వాచ్ చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల చుట్టూ వంద మీటర్ల దూరం వరకు సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమలు పరుస్తున్నారు. ప్రతి రోజు ఎన్నికల సంఘం అధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను పరిశీలిస్తున్నారు. ఎస్సారార్ కళాశాల మైదనాంలో ఉదయం, సాయంత్రం వేళ వాకర్స్‌ను నిషేధించారు. కౌంటింగ్ ముగిసే వరకు వాకర్స్‌ను అనుమతించకుండా ఆదేశాలు జారీ చేశారు.

● స్ట్రాంగ్‌రూంల భద్రతను అభ్యర్థులు పరిశీలించవచ్చు

ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను వివిద రాజకీయపార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఎప్పుడైనా భద్రతను పరిశీలించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉందా? ఇంకేమైనా అనుమానాలుంటే సీసీ కెమెరాల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్‌రూంల వద్ద పరిస్థితిని పరిశీలించేందుకు 24 గంటలపాటు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

కుక్కలు బాబోయ్..

- బెంబేలెత్తిస్తున్న శునకాలు - గుంపులుగా వీధుల్లో సంచారం
- ప్రజలు, మూగజీవాలపై దాడులు - పట్టించుకోని అధికారులు



సిరిసిల్ల మండలం పెద్దూర్‌లో రోడ్డుపై కుక్కల గుంపు

సిరిసిల్ల రూరల్, మే 17 : గ్రామాల్లోని ప్రజలను కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులుగా వీధుల్లో తిరుగుతూ ప్రజలు, మూగజీవాలు, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. రోడ్డుపై రావడానికి జంకుతున్నామని, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, పెద్దూర్, సర్ధాపూర్, రగుడు, చిన్నబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, దూప్యానాయక్ తండా, తుర్కాకాశీపల్లె, జగ్గారావుపల్లె, మాలపల్లె, బాబాజీ కాలనీ, ఇప్పల్లపల్లె గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. మహిళలు, చిన్న పిల్లలు బయటకు రావడానికి భయపడుతున్నారు. కుక్కల నుంచి మూగజీవాలకు రక్షణ లేకుండా పోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇటీవల పెద్దూర్ గ్రామంలోని పలువురు చిన్న పిల్లలపై దాడి చేసి గాయపర్చాయి. రగుడు గ్రామంలో వీధికుక్కలు చెలరేగిపోయాయి. గ్రామానికి చెందిన ఇటిక్యాల నారాయణతోపాటు పోతుల తిరుపతి, ఇటిక్యాల వజ్రవ్వపై దాడి చేశాయి. కుక్కలను బెడ దను నివారించాలని పెద్దూర్, రగుడు గ్రామాలకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్‌తోపాటు వార్డు కౌన్సిలర్‌లకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించాలని, సమస్య కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

గ్రామాల నుంచి తరలించాలి

- ఎరవెల్లి వెంకటరమణారావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పెద్దూర్



పెద్దూర్‌లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్ల మీద వెళ్తుంటే దాడి చేస్తు న్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కుక్కలతో ప్రజలు వీధులలో తిరుగలేని పరిస్థితి నెలకొంది జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు స్పందించాలి.

రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది

- సూర దేవరాజు, మాజీ ఎంపీటీసీ చంద్రంపేట



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. పెద్దలతోపాటు చిన్నపిల్లలు రోడ్డుపైకి వెళ్లాలంటే భయం తో వణికి పోతున్నారు. ఇటీ వల రగుడులో నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురిపై కుక్కలు దాడి చేశాయి. వారు తీవ్రంగా గాయపడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించాలి. గ్రామాల్లో కుక్కలబెడద నుంచి ప్రజలను కాపాడాలి.

పల్లె దవాఖానాల్లో అందని వైద్య సేవలు

- ప్రారంభించినా వినియోగంలోకిరాని పల్లె దవాఖానాలు



తాళం వేసి ఉన్న పల్లె దవాఖానా

కోనరావుపేట, మే 17 : గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. పల్లె దవాఖానాలను పాలకులు ప్రారంభించినా వినియోగంలోకి రాకపోవడంతో వైద్య సేవల కోసం ఎదురుచూస్తున్నారు. కోనరావుపేట మండల కేంద్రంతోపాటు సుద్దాల, మామిడిపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానాల నిర్మాణం చేపట్టారు. ఒక్కో పల్లె దవాఖానాకు జాతీయ హెల్త్ మిషన్ నిధుల ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. కోనరావుపేట, సుద్దాల, మామిడిపల్లి గ్రామాల్లో నిర్మించిన పల్లె దవాఖానాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మూడు నెలల క్రితం ప్రారంభించారు. ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో పల్లె దవాఖాన సేవలకు పల్లెవాసులు నోచుకోవడం లేదు. వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయక నిరుపయోగంగా మారాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించాలని, పల్లె దవాఖానాల్లో వైద్య సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు.

వైద్య శాఖకు అప్పగించలేదు

- మదన్‌మోహన్, మండల వైద్యాధికారి



కోనరావుపేట, సుద్దాల, మామిడిపల్లి గ్రామాల్లో నిర్మించిన పల్లె దవాఖానాలను ప్రారంభించింది వాస్తవమే. ఈ భవనాలను ఆరోగ్యశాఖకు అనుమతి ఇవ్వలేదు. చిన్న చిన్న నిర్మాణ పనులు ఉండడంతో అందించలేదు. ఆ పనులు పూర్తి చేసి అందిస్తే పల్లె వాసులకు సేవలను అందిస్తాం.